సాక్షి
కాకినాడ
శనివారం । 31 । ఆగస్టు । 2024



ఇటు కష్టాలు

ఇటుక, ఇటుక పేర్చితేనే ఇల్లు అవుతుందనే సామెత ప్రాచుర్యంలో ఉంది. అయితే అలాంటి ఇటుకల పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది.




గంజాయి స్వాధీనం

కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద 84.660 కిలోల గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, సరకును స్వాధీనం చేసుకున్నారు.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 2,91,599 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 11,200 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

జిల్లా ప్రత్యేక అధికారిగా వీరపాండ్యన్



కాకినాడ సిటీ: ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులుగా ఐఏఎస్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం **ఉత్తర్వులను** జారీ చేసింది. కాకినాడ జిల్లా ప్రత్యేక **అధికారిగా** జి.వీరపాండ్యన్‌ను నియమించింది**. ఈయన** సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఉన్నారు.

అందరూ మొక్కలు నాటాలి



జేఎన్‌టీయూలో మొక్కను నాటుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కాకినాడ సిటీ: భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, దీని ద్వారా సమాజానికి మేలు చేసినవారం అవుతామని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన, కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ కమిషనర్ భావన, జేసీ రాహుల్ మీనా ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. కాకినాడ జిల్లా సబ్ డివిజనల్ అటవీశాఖ అధికారిణి అనూష, అందరితోను ప్రతిజ్ఞ చేయించారు. వనమహోత్సవ కార్యక్రమం సందర్భంగా గత నాలుగు రోజులుగా జిల్లా అటవీశాఖ ద్వారా సుమారు 40 వేల మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పచ్చదనం, పర్యావరణ ఆవశ్యకతను వివరిస్తూ శంఖవరం ఏపీ మోడల్ స్కూల్‌కి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని స్వాతి, కాకినాడ ఎండోమెంట్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం.జయలక్ష్మి మాట్లాడారు. పర్యావరణ ప్రాధాన్యతను తెలియజేస్తూ అటవీశాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్, జేఎన్‌టీయు రెక్టార్ రమణ, కమిషనర్ భావన, జేసీ రాహుల్ మీనా ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

ఎడతెరిపిలేని వాన

- జిల్లా అంతటా వర్షం
- శుక్రవారం ఉదయం నుంచి సాయంత్ర వరకు 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం
- మరో రెండు రోజులు వర్ష సూచన

కాకినాడ సిటీ: వరుణుడి హోరు కొనసాగుతోంది. జిల్లాలో వర్షాలు ఆగడం లేదు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు 21 మండలాల్లో ఏకంగా 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి శుక్రవారం 8 గంటల వరకు జిల్లాలో 11 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా తాళ్లరేవు మండలంలో 20.6 మిల్లీమీటర్లు వర్షం కురవగా గండేపల్లిలో అత్యల్పంగా 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో తునిలో 17.6, కరప 16.6, కాకినాడ అర్బన్ 15.2, కాకినాడ రూరల్ 14.2, పిఠాపురం 14.2, కాజులూరు 13.4, కోటనందూరు 13.2, తొండంగి 12.4, యు కొత్తపల్లి 12.4, శంఖవరం 12, కిర్లంపూడి 11.4, పెదపూడి 10.2, రౌతులపూడి 8.6, ఏలేశ్వరం 7.6, జగ్గంపేట 6.8, సామర్లకోట 5.8, పెద్దాపురం 4.4, గండేపల్లి 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ వర్షం వల్ల వ్యవసాయ పంటలకు ఏవిధమైన నష్టం వాటిల్లదని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

అంధత్వ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



ఐబ్యాంక్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

బాలాజీచెరువు: అంధత్వ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. జిల్లా అంధత్వ రహిత నివారణ సంస్థ, బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ ఆధ్వర్యంలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నేత్రదాన అవగాహన కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నేత్రదానంపై మరింత అవగాహన పెంచి అంధులకు వెలుగులు ప్రసాదించాలన్నారు. ఐబ్యాంక్ చైర్మన్ దామెర విజయలక్ష్మి మాట్లాడుతూ సెప్టెంబర్ 8వరకూ విద్యాలయాలు, పలు ముఖ్య ప్రదేశాల్లో శిబిరాలు, లఘు చిత్రాలు ప్రదర్శించి అవగాహన కల్పిస్తామని, ఇప్పటి వరకూ 7076 కార్నియాలు సేకరించి ఉపయోగించామన్నారు. ఐబ్యాంక్ కార్యదర్శి బాదం బాలకృష్ణ, డాక్టర్ పీవీ ప్రసాద్, కోశాధికారి దాసరి సాయికృష్ణ, ట్రస్టీ పైడా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుకేది భరోసా?



ఎన్నికల వేళ ఎడాపెడా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలుకు కాలయాపన మంత్రం జపిస్తోంది. సూపర్ సిక్స్‌తో మొదలు పెట్టి, మేనిఫెస్టోతో ఊదరగొట్టి అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించిన కూటమి నేతలు ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదు. రైతులకు ఏటా రూ.20 వేల సాయమందిస్తామన్న మాటను నమ్మి ఓట్లేసిన అన్నదాతలు ఆ సాయం ఎప్పుడు అందుతుందా? అని ఎదురుచూస్తున్నారు.

- **పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతు ఖాతాల్లో జమ**
- **ఇంకా విడుదల కాని రాష్ట్ర** ప్రభుత్వం వాటా నిధులు
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఖరీఫ్ సాగు మొదలై నెల రోజులు కావస్తున్నా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించలేదు. ఇప్పటికే రైతులు పెట్టుబడుల కోసం బయట వ్యాపారస్తుల వద్ద అప్పులు చేసుకొని మరీ సాగు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జులై నెలలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం తమ వాటా కింద రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,63,927 మందికి రూ.32.78 కోట్లు జమ చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నగదుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై చంద్రబాబు సర్కారు నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు.

జగన్ హయాంలో అన్నదాతలకు ఆర్థిక భరోసా

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. దీనిలో కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 కలిపి మొత్తం రూ.13, 500 చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. జిల్లాలో రెండు లక్షలకు పైగా ఉన్న రైతులకు ఈ ఐదేళ్లలో కేవలం రైతు భరోసా ద్వారానే రూ.1,121 కోట్ల లబ్ధి చేకూరింది.

నాడు మూడు విడతల్లో సకాలంలో జమ

జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఇబ్బంది లేకుండా వైఎస్సార్ రైతు భరోసా సొమ్ము సకాలంలో ఖాతాల్లో జమ చేశారు. ఖరీఫ్ పంట వేసే ముందు ఏటా సరిగ్గా మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 జమ చేసేవారు. తర్వాత అక్టోబర్ నెలలో ఖరీఫ్ పంట కోతలతో పాటు రబీ సాగు అవసరాల కోసం రెండో విడతలో రూ.4 వేలు జమ చేసేవారు. ఆ తర్వాత జనవరి నెలలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండగ సమయంలో మరో రూ.2 వేలు.. ఇలా మూడు విడతల్లో మొత్తం రూ.13,500 చొప్పున వారి ఖాతాల్లో జమ అయ్యేది. ఇలా ఐదేళ్లు ఏటా సకాలంలో రైతులను ఆదుకొంటూ వచ్చారు. కరోనా సమయంలో కూడా రైతులకు ఇబ్బంది లేకుండా రైతు భరోసా నిధులు వారి ఖాతాల్లో జమ చేశారు. వైఎస్సార్ రైతు భరోసాతోపాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా అనేక పథకాల ద్వారా గత ప్రభుత్వం రైతులకు ఆర్థికంగా అండగా నిలిచింది.

సాగుకు ముందు సాయమేది?

తాను అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేల చొప్పున ఒక్కో రైతు ఖాతాలో జమ చేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఖరీఫ్ సాగుకు కేంద్రం నిధులు విడుదల చేయడంతో రైతులంతా రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఏటా ఇస్తామన్న రూ.20 వేలలో మొదటి విడతగా ఎంత జమ చేస్తుందో కూడా తెలియడం లేదు. దీనిపై ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. అయితే ఖరీఫ్ సాగు పూర్తికాకుండా ప్రభుత్వం సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఐదేళ్లలో లబ్ధి పొందారిలా

సంవత్సరం	రైతుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
2019- 20	1,70,698	181.02
2020- 21	1,66,963	216. 22
2021- 22	1,62,125	214.43
2022-23	1,69,989	190.71
2023-24	1,74,229	250.36

పెట్టుబడికి అప్పులు చేస్తున్నాం



ఖరీఫ్ సాగు మొదలు పెట్టి నెలరోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాయం అందలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2 వేల సాయం వరినాట్ల సమయంలో ఖర్చయిపోయింది. ప్రస్తుతం వరి పంటలకు ఎరువులు వేసుకోవాలి. కానీ డబ్బులు లేకపోవడంతో బయట అప్పులు తెచ్చుకొంటున్నాం.

– ఎలుగుబంట్ల రవినాయుడు, రైతు, కూరాడ, కరప మండలం

హామీని అమలు చేయాలి



అధికారంలోకి వస్తే ఏటా రైతులకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఖరీఫ్ పనులు ప్రారంభమై నెలరోజులు దాటినా ఇప్పటి వరకూ పెట్టుబడి సాయం అందలేదు. బయట వ్యాపారస్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తున్నాం. పెట్టుబడి సాయం ఇస్తే రైతులకు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ఎంతో ఆసరాగా ఉంటుంది.

– తుమ్మల అచ్చియ్య, రైతు, పులిమేరు, పెద్దాపురం మండలం

గణేశ్ ఉత్సవాల నిర్వహణకు వినతి



జేసీ రాహుల్ మీనాకు వినతి పత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 7 నుంచి మొదలయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలు 16న నిర్వహించే నిమజ్జన ఉత్సవం సాఫీగా సాగేలా ప్రభుత్వ శాఖల సహకారం అందించాలని నగర గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కోరారు.

శుక్రవారం కలెక్టరేట్‌లో సమితి నాయకులు జేసీ కలిసి మెమొరాండం అందజేశారు. జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, అన్నవరం, తుని, పత్తిపాడు, జగ్గంపేట తదితర పట్టణాల్లో, గ్రామాల్లో స్థానిక తహసీల్దార్ల అధ్యక్షతన పదాధికారులతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. ఉత్సవ నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగిల్ విండో విధానంలో తోడ్పాటు ఇవ్వాలన్నారు. సాధారణ పందిళ్లకు ఇండ్లు, షాపుల నుంచి కరెంటు సరఫరా పొందే అవకాశం కొనసాగించాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో వేదిక సౌండ్ సిస్టం తాగునీరు, అంబులెన్స్, ఫ్లడ్ లైట్లు, గజ ఈతగాళ్లు ఉంచాలన్నారు. నిమజ్జనం రోజున మద్యం దుకాణాలు మూసివేయాలని, అమ్మకాలు జరగకుండా చూడాలన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు మధ్యాహ్నం పూట సెలవు ప్రకటించాలని జేసీ రాహుల్ మీనాను కోరారు. జేసీని కలిసిన వారిలో జిల్లా కన్వీనర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య, సమితి గౌరవ అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు, కోకన్వీనర్లు దువ్వూరి సుబ్రహ్మణ్యం, రంబాల వెంకటేశ్వరరావు ఉన్నారు.

వరలక్ష్మీ పూజలో గృహలక్ష్ములు

- రత్నగిరిపై ఘనంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం
- పాల్గొన్న 6,200 మంది మహిళలు
- నిత్య కల్యాణ మంటపంతో పాటు వ్రత మంటపాలలో నిర్వహణ
- వేలసంఖ్యలో వచ్చిన మహిళలతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న ఆలయ ఏఈఓ కృష్ణారావు, ఇతర అధికారులు



వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

అన్నవరం: ప్రతిరోజూ సత్యదేవుని నామజపంతో మార్మోగే రత్నగిరి శ్రావణ మాసం చివరి శుక్రవారం మాత్రం ' కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి... వరలక్ష్మీ నమోస్తుతే 'అని మహిళల ప్రార్థనలతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని సన్నిధిలో శ్రావణ మాస చివరి శుక్రవారం పర్వదినం సందర్భంగా దేవస్థానంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని నిత్యకల్యాణ మంటపంతో బాటువాయువ్య, నైరుతి వ్రత మంటపాలలో ఈ వ్రతాలు నిర్వహించారు. అనుకున్న దానికన్నా ఎక్కువగా మొత్తం ఎనిమిది బ్యాచ్‌లలో 6,200 మంది మహిళలు ఈ వ్రతాలు ఆచరించారు. దీంతో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ రత్నగిరి ఆలయ ప్రాంగణం మహిళలతో కిటకిటలాడింది. సత్యదేవుని నిత్య కల్యాణ మంటపంలో ఉదయం ఎనిమిది గంటలకు పండితుల మంత్రోచ్చారణ మధ్య దేవస్థానం ఏఈఓ దామెర కృష్ణారావు జ్యోతి వెలిగించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం పండితులు విఘ్నేశ్వరపూజ, కలశస్థాపన, శ్రీసత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య కల్యాణ మంటపం వేదికపై ప్రతిష్ఠించిన వరలక్ష్మీ అమ్మవారికి ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు మహిళలతో తొలుత విఘ్నేశ్వరపూజ చేయించి అనంతరం శ్రీవరలక్ష్మీ వ్రతం చేయించారు. ఈ వ్రతం ఆచరించడం వల్ల మహిళలకు ఐదవతనంతో బాటు సిరిసంపదలు, ఆయురారోగ్యాలను అమ్మవారు ప్రసాదిస్తారని తెలిపారు. అనంతరం వరలక్ష్మీ అమ్మవారికి, సత్యదేవుడు, అమ్మవార్లకు హారతి సమర్పించారు. కలశం మీద ఉంచిన తోరం కుడిచేతికి మహిళలు ధరించారు. కార్యక్రమం చివరలో కలశానికి ఉద్వాసన తెలిపి వ్రతాలను ముగించారు. అనంతరం వేదపండితులు వ్రతం ఆచరించిన మహిళలకు ఆశీస్సులందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఉచితంగా జాకెట్టుముక్క, సత్యదేవుని ప్రసాదం, అమ్మవారి రాగి రూపు, చేతికి కట్టుకునే తోరం, గాజులను అందజేశారు. వ్రతంలో పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చింది. పూజల అనంతరం మహిళలు ప్రత్యేక క్యూ ద్వారా సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం నిత్యాన్నదాన పథకంలో వీరికి భోజన సౌకర్యం కలుగజేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, యనమండ్ర శర్మ ఘనాపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, ఉప ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, అర్చకులు శర్మ, సుధీర్, పరిచారకులు యడవిల్లి చిన్నా, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వ్రత పురోహితులు పాలంకి పట్టాభి, నాగాభట్ల రవిశర్మ, దేవులపల్లి ప్రకాష్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏఈఓ జగ్గారావు, సూపరింటెండెంట్ స్వామీజీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

శ్రావణమాసంలో చివరి శుక్రవారం రత్నగిరిపై నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతానికి అంచనాకు మించి మహిళలు హాజరయ్యారు. ఐదు వేల మంది వరకూ మహిళలు విచ్చేస్తారనే అంచనాతో దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అంచనాకు మించి 6,200 పైగా మహిళలు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం ఎనిమిది గంటలకు వరలక్ష్మీ వ్రతాలు ప్రారంభమవగా ఆరుగంటల నుంచే మహిళలు రత్నగిరికి రావడం ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభమయ్యే సమయానికి స్వామివారి నిత్య కల్యాణ మంటపంతో బాటు వాయువ్య, నైరుతి వ్రత మంటపాలు మహిళలతో నిండిపోగా, అంతకు రెండింతలు మహిళలు బయట వేచి ఉన్నారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరవడం విశేషం. నిత్య కల్యాణ మంటపంలో రెండు బ్యాచ్‌లు, మిగిలిన మంటపాలలో మూడేసి బ్యాచ్‌ల చొప్పున ఎనిమిది బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం సిబ్బంది క్యూ లో మహిళలకు మంచినీరు సరఫరా చేశారు. వ్రత పురోహితులు, అర్చకస్వాములు కూడా సామూహిక వ్రతాల నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.

ఎలక్షన్ కాదు.. సెలక్షన్



ఏలేరు ప్రాజెక్టు

- **పాత విధానంలోనే నీటి సంఘాల ఎన్నికలు**
- **ఏకగ్రీవం పేరుతో కూటమి** నేతలకే కట్టబెట్టే యత్నం
- ఉమ్మడి జిల్లాలో గోదావరి, ఏలేరుతో సహా ఐదు ప్రాజెక్టు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 401 డబ్ల్యూయూఏలు

సాక్షి, అమలాపురం: వడ్డించే వాడు మనోడైతే చివరి పంక్తిలో కూర్చున్నా ఫర్వాలేదన్నది సామెత.. నీటి సంఘాల ఎన్నికలకు వెళుతున్న కూటమి ప్రభుత్వం అచ్చం అలానే వ్యవహరిస్తోంది.. ఈ ఎన్నికల ముసుగులో తమ అనుచరులకే పదవులు కట్టబెట్టేందుకు తెరలేపింది.. ఈ ఎన్నికల ప్రక్రియను మూడు నెలల్లోనే పూర్తి చేసేందుకు రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించింది.. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టు కమిటీల ఎన్నికల్లో పచ్చ నేతలకు ప్రాధాన్యం కల్పించేందుకు రంగం సిద్ధమవుతోంది. పాత విధానంలోనే ఎన్నికలు నిర్వహిస్తే అవి ఎలక్షన్ కాదు.. దాని ముసుగులో సెలక్షన్ అని చెప్పకనే అర్థమవుతోంది.

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మరో మూడు నెలల్లో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక్కడ గోదావరి, ఏలేరు ప్రాజెక్టు కమిటీ (పీసీ)లు కీలకమైనవి. ఈ రెండూ మేజర్ ప్రాజెక్టుల పరిధిలోకి రాగా, మీడియం ప్రాజెక్టు పరిధిలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్, పంపా రిజర్వాయర్, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవి కాకుండా మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులూ ఉన్నాయి. ప్రాజెక్టు కమిటీల్లో గ్రామ స్థాయిలో వాటర్ యూజర్స్ కమిటీ (డబ్ల్యూయూఏ)లు, వాటిపై డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు, ప్రాజెక్టు కమిటీ (పీసీ)ల వ్యవస్థ ఉంది. జిల్లాలోని నీటి సంఘాల పరిధిలో సుమారు 6.20 లక్షల ఎకరాల వరి ఆయకట్టు ఉందని అంచనా. ప్రాజెక్టు కమిటీల్లో తొలుత డబ్ల్యూయూఏలలో ఎన్నిక జరుగుతోంది. ఎన్నికైన వారంతా కలసి డీసీ చైర్మన్, వైస్ చైర్మన్లను, సభ్యులను ఎన్నుకుంటారు. వీరంతా కలసి ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నాలుగు ఇరిగేషన్ సబ్ డివిజన్లు ఉన్నాయి. గోదావరి ఈస్టర్న్ డెల్టా, గోదావరి సెంట్రల్ డెల్టా (ధవళేశ్వరం), ఏలేశ్వరం డివిజన్ (పెద్దాపురం), స్పెషల్ ఎంఐ. డివిజన్ (రంపచోడవరం) ఉన్నాయి. ఇందులో గోదావరి ప్రాజెక్టు కమిటీ అతి పెద్దది. దీని పరిధిలో 144 డబ్ల్యూయూఏలు, 25 డీసీలు ఉన్నాయి. తరువాత ఏలేరు ప్రాజెక్టు కమిటీ వస్తోంది. ఇందులో 25 డబ్ల్యూయూఏలు, ఐదు డీసీలు ఉన్నాయి. తొండంగి పంపింగ్ స్కీమ్‌లో నాలుగు, పంపా రిజర్వాయర్ ప్రాజెక్టు పరిధిలో ఆరు, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఆరు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో 216 డబ్ల్యూయూఏలు ఉన్నాయి. మొత్తం ఉమ్మడి తూర్పు గోదావరిలో ఐదు ప్రాజెక్టులు, వాటి పరిధిలో 30 డీసీలు, 401 డబ్ల్యూయూఏలు పనిచేస్తున్నాయి. నీటి తీరువా ఏటా రూ.16 కోట్ల వరకూ వసూలు అవుతోంది.

ఏకగ్రీవం పేరుతో...

డబ్ల్యూయూఏల ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలోని రైతులంతా ఏకాభిప్రాయంతో సాగునీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, నలుగురు సభ్యులను ఎన్నుకోవాలి. నీటి సంఘాలు ఏర్పడి న మొదట్లో బ్యాలెట్ విధానాన్ని అనుసరించారు. గత టీడీపీ హయాంలో రైతుల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేక పరిణామాల నేపథ్యంలో 2019లో ఏకాభిప్రాయం, చర్చల ద్వారా ఎన్నుకునే విధానాన్ని తీసుకువచ్చారు. తద్వారా టీడీపీ వారికి పదవుల ను కట్టబెట్టారు. అప్పుడు విడుదల చేసిన సాగునీటి సంఘాల ఎన్నికల జీఓలో ఒక గొప్ప విషయాన్ని చేర్చారు. ఎన్నిక ఏకగ్రీవంగా జరగాలి. అ యితే ఏకగ్రీవం కాకుంటే ఏంటనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఆనాడు జరిగిన ఎన్నికల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సభలు ఏర్పాటు చేసి త మవారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రికార్డుల్లో రాసుకుంది. రాయవరం మండల పరిధి పసలపూడిలో వ్యతిరేకత రావడంతో ఎన్నిక నిలుపుదల చేశారు. వెలగతోడు ఎన్నిక జరగలేదని ఎన్నికల అధికారులు ప్రకటించి రికార్డుల్లో రాసినా, తమకు అనుకూలమైన వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నాటి ప్రభుత్వం ఏకంగా జీఓ ఇవ్వడం విశేషం. ఇవన్నీ చూసిన ఆయకట్టు రైతులకు కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపిస్తారనే నమ్మకం కలగడం లేదు.

పద్మావతీదేవికి పండ్లతో అలంకరణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి సన్నిధిలో కొలువు దీరిన శ్రీపద్మావతీదేవికి శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. యాపిల్స్, అనాస, బత్తాయి, పంపర పనస, దానిమ్మ తదితర పండ్లతో పాటు పట్టు చీరలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



క్లుప్తంగా

యువతిని మోసగించిన వ్యక్తికి జైలు

ఉప్పలగుప్తం: ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన కేసులో ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి శివారు రాఘవులపేటకు చెందిన కొప్పాడి నాగరాజుకు పదేళ్ల జైలు శిక్ష పడింది. అలాగే రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వై.టిన్నయ్యనాయుడు శుక్రవారం తీర్పు ఇచ్చారు. దీనిపై అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు కథనం ప్రకారం.. ఎస్.కొత్తపల్లి శివారు రాఘవులపేటకు చెందిన కొప్పాడి నాగరాజు అదే గ్రామంలో విద్యా వలంటీర్‌గా పనిచేస్తుండగా, అదే పాఠశాలలో విద్యా వలంటీర్‌గా పనిచేస్తున్న యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆపై అత్యాచారం చేశాడన్నది అభియోగం. దీనిపై బాధితురాలు 2019 సెప్టెంబర్ 26న ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పట్లో ఈ కేసును సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్సై ఎస్.సన్యాసినాయుడు దర్యాప్తు చేసి నిందితుడు నాగరాజును అరెస్ట్ చేశారు. శుక్రవారం కోర్టులో జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో నాగరాజుకు పైవిధంగా శిక్ష విధించారు. సరైన సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్ దాఖలు చేసి, నిందితుడికి శిక్షపడేలా చేసిన అప్పటి సీఐ భీమరాజు, ఎస్సై సన్యాసినాయుడు, కేసు ట్రయిల్‌కు కృషి చేసిన ఇప్పటి సీఐ వీరబాబులను జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు నాగేంద్ర

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్ కుమార్ కథనం ప్రకారం.. చెరుకుమిల్లి గ్రామానికి చెందిన దాకే నాగేంద్ర అతని స్నేహితుడు కొర్లపాటి రామకృష్ణతో కలసి గోపాలపురం వచ్చి తిరిగి వెళ్తుండగా చిట్యాల, చెరుకుమిల్లి గ్రామాల మధ్య మోటార్ సైకిల్ అదుపు తప్పింది. వెంటనే రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లడంతో మోటార్ సైకిల్ నడుపుతున్న దాకే నాగేంద్ర (30) తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న కొర్లపాటి రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతనికి గోపాలపురం సీహెచ్‌సీలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామానికి చెందిన ముప్పిడి వెంకట శివ సూర్యనారాయణ ఈ నెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య దుర్గాభవానీ శుక్రవారం ఫిర్యాదు ఇచ్చినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. మార్కెట్‌కు వెళ్లి సరకులు తీసుకొస్తానని సూర్యనారాయణ చెప్పి వెళ్లి తిరిగి రాలేదని ఆమె పేర్కొంది. మూడు రోజుల తర్వాత ఫోన్ చేసి తాను విశాఖపట్నానికి లారీపై డ్రైవర్‌గా వచ్చానని, సమయం పడుతుందని చెప్పినట్లు వివరించింది. అనంతరం సెల్‌ఫోన్ కూడా పనిచేయడం లేదని ఆమె ఫిర్యాదు ఇవ్వడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇటుక కష్టాలు

- సంక్షోభంలో పరిశ్రమ
- పడిపోయిన ఎగుమతులు
- పనులు లేక అల్లాడుతున్న కూలీలు

అలమూరు: ఇటుక, ఇటుక పేర్చితేనే ఇల్లు అవుతుందనే సామెత ప్రాచుర్యంలో ఉంది. అయితే అలాంటి ఇటుకల పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది.. రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన ఇక్కడి పరిశ్రమ రోజు రోజుకూ కుదేలవుతోంది. ఈ పరిశ్రమ అంతా వలస కూలీలపైనే ఆధారపడటం, పోటీతత్వం అధికమవడం, ముడిసరకు ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో నష్టాల బాట పడుతుంది. వేలాది మంది కార్మికులకు జీవనోపాధిని కల్పించే పరిశ్రమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో సుమారు ఐదు వేల వరకూ ఇటుక బట్టీలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో దాదాపు 1,800 ఇటుక బట్టీల వరకూ ఉంటాయి. ప్రధానంగా కొత్తపేట, ఆత్రేయపురం, కపిలేశ్వరపురం, అయినవిల్లి, రాయవరం, పి.గన్నవరం, కె.గంగవరం, నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు మండలాల్లోని కొన్ని ప్రాంతాల పరిశ్రమలు ఇటుక తయారీలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆలమూరు, రాయవరం మండలాల్లో తయారైన ఇటుకకు నాణ్యత, సైజు పరంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. బహిరంగ మార్కెట్‌తో సంబంధం లేకుండా ఈ ఇటుకకు ఎప్పుడూ మంచి డిమాండ్ ఉంటోంది. మొత్తం బట్టీల ద్వారా జిల్లాలో దాదాపు 30 లక్షల వరకూ ఇటుక ఉత్పత్తి అవుతుంది. ఇటీవల కాలంలో వర్షాల ప్రభావం, ఇటుకకు సరైన డిమాండ్ లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 500 బట్టీల వరకూ మూసివేశారు. పెరిగిన ముడి సరకు ధరలను తట్టుకోలేక కొందరు, ఎగుమతులు లేక మరికొందరు ఇటుక తయారీని తగ్గించడంతో ఉత్పత్తి సగానికి పైగా పడిపోయింది. ఇటుక ఎగుమతులు లేక బట్టీల వద్ద ఎక్కడ చూసినా సరకు నిల్వలు నిలిచిపోయాయి. కార్పొరేట్ స్థాయి ఇటుక పరిశ్రమ యజమానులు ఈ గడ్డు పరిస్థితిని పెద్దగా పట్టించుకోకపోగా.. ఆర్థికపరమైన ఇబ్బందులతో నిత్యం పోరాడుతున్న చిరు యజమానులు మాత్రం తాము తయారు చేసిన ఇటుకను అయినకాడికి విక్రయించుకుని నష్టపోతూ కాలాన్ని నెట్టుకొస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు నెలల తరబడి కొనసాగితే జిల్లాలో దాదాపు మూడు వంతుల బట్టీలు మూసివేయక తప్పదని యజమానులు వాపోతున్నారు.



చొప్పెల్లలో వర్షాల కారణంగా మూసివేసిన ఇటుక బట్టీ



అలమూరులో ఎగుమతులు లేక నిలిచిపోయిన ఇటుకలు

ముడి సరకు	గత ధర (రూ.)	కొత్త ధర (రూ.)
నల్లమట్టి	(ట్రాక్టర్) 900	2,500
బొండు ఇసుక	(ట్రాక్టర్) 5,00	2,300
ఊక	(టన్ను) 1,500	5,000
బూడిద	(టన్ను) 600	3,000
పుల్లలు	(టన్ను) 1,400	2,700
తాటిపట్టెలు	(టన్ను) 800	2,200

ఎగుమతులు లేక..

గతంలో ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, భీమవరం పరిసర ప్రాంతాలకు వందల లారీల్లో ఇటుక ఎగుమతులు జరిగేవి. ఇటీవల కాలంలో పోటీ పెరిగి ఆయా పట్టణాలు, నగరాల్లోనూ ఇటుక బట్టీలను ఏర్పాటు చేయడంతో ఎగుమతులు తగ్గిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లోనే ఇటుక దొరకడం, రవాణా చార్జీలు తగ్గడంతో బిల్డర్లు అక్కడి ఇటుకనే వినియోగిస్తున్నారు. దీనివల్ల మన జిల్లాల్లో తయారు చేసే ఇటుకకు డిమాండ్ తగ్గి వ్యాపారులు నష్టాలు చూస్తున్నారు. ప్రస్తుతం ఇటుక పరిశ్రమలో తలెత్తిన అనిశ్చితితో దాదాపు మూడు కోట్ల ఇటుక నిల్వలు ఉండిపోయాయి. ఈ పరిశ్రమతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. ఎగుమతులు రోజు రోజుకూ తగ్గిపోవడంతో పాటు వర్షాలతో ఇటుక బట్టీల్లో పనులు ఉండడం లేదు. ఈ గడ్డు పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి, తమను గట్టెక్కించాలని నిర్వాహకులు కోరుతున్నారు.



ఇటీవల భారీ వర్షాలకు పాడైన పచ్చి ఇటుక

ముడి సరకు ధర.. పైపైకి

ఇటీవల కాలంలో ఇటుక తయారీకి ఉపయోగించే ముడిసరకు ధర అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోతుంది. పరిశ్రమలో పోటీతత్వం పెరిగి కూలీలకు చెల్లించే ధర కూడా అమాంతం పెంచేస్తున్నారు. వెయ్యి ఇటుక తయారీకి సుమారు రూ.ఐదు వేల వరకూ ఖర్చు అవుతుండగా, మార్కెట్‌లో తగిన డిమాండ్ లేక ఆర్థిక లావాదేవీల నిర్వహణకు బట్టీ యజమానులు ఇంచుమించు అదే ధరకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇటుక తయారీ కూలీకి రోజుకు రూ.600 వరకూ కూలి ఉండగా, ప్రస్తుతం రూ.900కు చేరుకుంది. వీరిని ఇతర జిల్లాల నుంచి తీసుకురావడంతో అదనపు భారం పడుతోంది. సాధారణంగా జిల్లాలో లీజులకు తీసుకుని ఇటుక బట్టీలను నడుపుతుంటారు. గతంతో ప్రదేశాన్ని, సానుకూలతను బట్టి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ లీజు ఉండగా, ప్రస్తుతం రూ.2.5 లక్షల నుంచి రూ.మూడు లక్షలకు చేరుకుంది. ఇదీ బట్టీల యజమానులకు భారంగా మారింది.

ప్రభుత్వం చొరవ చూపాలి



ఇటుక పరిశ్రమ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఇటుక తయారీకి అవుతున్న ఖర్చుకు, విక్రయిస్తున్న ధరకు పొంతన లేకపోతుంది. యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదే క్రమంలో ముడిసరకు కొరత తీవ్రంగా వేధిస్తుంది. వేలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న ఇటుక పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలి.

–చల్లా ప్రభాకరరావు, ఇటుక పరిశ్రమ మండల సమాఖ్య అధ్యక్షుడు, ఆలమూరు

జీవనోపాధి లేకుండా..



ఇటీవల కురుస్తున్న వర్షాలకు పనులు లేక కూలి సొమ్ము రాక జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడింది. దీనివల్ల యజమానిపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఎప్పటి నుంచో ఇటుక బట్టీల్లో పనికి అలవాటు పడిన నేను ఇంకొక పని చేయలేను. వర్షాలతో పనులు లేకుండా పోతోంది.

–ఆకేటి లక్ష్మి, బట్టీ కార్మికురాలు, వెదురుమూడి

రాష్ట్రాలు దాటి వచ్చాం..



బతుకు దెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చాం. కూలి పనికి ఇటుక బట్టీల్లో కుటుంబంతో సహా చేరాం. బట్టీల్లో తగిన పనిలేక కూలి అంతంత మాత్రంగానే వస్తుంది. ఇటుక ఉత్పత్తి పెరిగితే తమకు కూడా వేతనం పెరుగుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

–సభికుల్ ముల్లా, కార్మికుడు, పశ్చిమ బంగ

వేళంగిలో వృద్ధురాలిపై దాడి

కరప: ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఓ ప్రబుద్ధుడు దాడికి ఒడిగట్టిన ఘటన కరప మండలం వేళంగిలో జరిగింది. అసలు విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. వేళంగి కరణంగారి వీధిలో వృద్ధురాలు (85) తన సోదరితో కలసి ఉంటోంది. సోదరి ఊరెళ్లడంతో వృద్ధురాలు ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి 11 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ ఆ ఇంట్లోకి వెళ్లి ఆమెపై దాడికి పాల్పడినట్లు స్థానికులు అంటున్నారు. శుక్రవారం ఉదయం బాధితురాలు మూలుగుతున్నట్టు వినపడటంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూసేసరికి శరీరంపై రక్తపు గాయాలు ఉన్నాయి. ఇళ్లంతా ట్యూబ్‌లైట్ బద్దలకొట్టిన ముక్కలు ఉన్నాయి. వెంటనే స్థానికులు కరప పోలీసులకు సమాచారం అందించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప ఇన్‌చార్జి ఎస్ఐ కె.రామారావు నిందితుడు వెంకటరమణను అదుపులోకి తీసుకుని, బాధితురాలిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కరప ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్, సిబ్బందితో ఘటనా స్థలానికెళ్లి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. అయితే నిందితుడు తాగిన మత్తులో వృద్ధురాలిపై కత్తితో దాడిచేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. గతంలో రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా నిందితుడు ఇదే తరహా నేరానికి పాల్పడినట్లు తెలిసింది. నిందితుడి భార్య కువైట్‌లో ఉండగా, ఇద్దరు పిల్లలతో వేళంగిలో ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బాధితురాలు తెలిపే వివరాలను బట్టి నిందితుడిపై కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ ప్రసన్నకుమార్ వివరించారు.

ఆటో బోల్తా: ఏడుగురికి గాయాలు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం సమనసలో శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. సమనస శ్రీరామ పాఠశాలకు చెందిన ఆ విద్యార్థులు ఆటోలో సవర్పాపాలెం వెళ్తుండగా సమనస పోలేరమ్మ గుడి వద్దకు వచ్చేసరికి ఒక ఇంటి వద్ద ర్యాంప్‌ను వేగంగా ఢీకొని బోల్తా పడింది. స్థానికులు వెంటనే ఆటోలో ఉన్న విద్యార్థులను బయటకు తీసి అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలో పదో తరగతి ప్రత్యేక తరగతుల కారణంగా ఆలస్యంగా ఆటోలో బయలుదేరి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సవర్పాపాలెం, డి.రావులపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ ప్రమాదంలో గాయపడినట్లు చెబుతున్నారు.

ఆటో డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అమలాపురం తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

హాయ్‌అంటే అనుమతులు

వినాయక ఉత్సవాలకు సింగిల్ విండో విధానం

కాకినాడ క్రైం: జిల్లాలో వినాయక ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. వాట్సాప్‌లో 'హాయ్' (ఏజీ) అని ఆంగ్లంలో టైప్ చేసి 79950 95800 నంబర్‌కు మెసేజ్ పంపితే అనుమతులు పొందేందుకు అన్ని వివరాలు అదే చాట్‌లో మెసేజ్ రూపంలో అందుతాయన్నారు. ఇందులో లింక్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే, http://ganeshutsav.net వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, న్యూ అప్లికేషన్ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే ఓటీపీ ద్వారా వివరాల నమోదు, తదనంతర ప్రక్రియలు పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ రెండు విధానాల్లో ఎలా దరఖాస్తు చేసుకున్నా పొందుపరిచిన వివరాలను అనుసరించి ఉత్సవాలు నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించేందుకు ముందస్తు తేదీ, సమయం తెలియజేసి పోలీస్ అధికారులు వస్తారని అన్నారు. కేవలం ఈ విధానాల్లో అనుమతులు పొందిన వారు మాత్రమే ఉత్సవాల నిర్వహణకు అనుమతిస్తామని, ప్రక్రియను విస్మరించి ఉత్సవాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ వివరించారు.

13 మంది విద్యార్థినుల డిశ్చార్జి



ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో బాధిత విద్యార్థినులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల/ కళాశాలకు చెందిన 88 మంది విద్యార్థినులు ఈ నెల 27న ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వీరంతా కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాలుగు రోజులుగా పలువురు డిశ్చార్జ్ కాగా శుక్రవారం మరో 13 మంది ఆరోగ్యం కుదుట పడడంతో ఇంటికి పంపించారు. మరో ముగ్గురికి చికిత్స అందిస్తున్నారు. బాధిత విద్యార్థినులను వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, వాగుబలరామ్ పరామర్శించారు. విద్యార్థినులు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పాండ్రింకి రామ్మోహనరావు, దాకమర్రి లోవరాజు తదితరులు ఉన్నారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురి అరెస్ట్

కిర్లంపూడి: గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, జగ్గంపేట సీఐ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ వివరాల ప్రకారం .. ముందస్తు సమాచారంతో మండలంలోని కృష్ణవరం టోల్‌గేట్ వద్ద ఎస్సై జి.సతీష్ పోలీస్ సిబ్బందితో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్‌ను తనిఖీ చేశారు. డ్రైవర్ కేబిన్‌లో టాప్, సీటు కింద అమర్చిన అరల్లో 43 ప్యాకెట్లలో 84.660 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో డ్రైవర్ అన్సారీ, పాంగి సన్యాసిరావు, కైసర్ల దివాకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. గంజాయితో పాటు ట్యాంకర్, నిందితుల నుంచి రూ.వెయ్యి నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుల సమాచారం మేరకు కేరళకు చెందిన ప్రధాన ముద్దాయి రాజేష్ ఒడిశా ఏజెన్సీలో తక్కువ ధరకు గంజాయిని కొని చెన్నైలో ఉండే ధనశేఖర్‌కు పంపిస్తున్నారని డీఎస్పీ తెలిపారు. ఈ రవాణాకు పాల్పడిన అన్సారీ, పాంగి సన్యాసిరావు, కైసర్ల దివాకర్లపై కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం ప్రత్తిపాడు కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. పరారీలో ఉన్న రాజేష్, ధనశేఖర్ కోసం గాలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో హెచ్‌సీ ఎస్వీ రమణ, గణేశ్వరావు, పి.శివ, సుబ్బిరామిరెడ్డి తదితరులు ఉన్నారు.



కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

సాక్షి క్లాసిఫైడ్స్

Education

Services

EDUCATION

■ B.P.T, B.Sc. MLT, DMLT, Med. Imaging, Anaesthesia, DRGA (RADIOGRAPHY), Cardio, Dialysis - Eligi : Inter Bi.P.C / Voc. MLT / DMLT / Any group. MGT Quota Seats - ASIAN - VJA. Ph : 76800 65835 [V- 2679]

BUSINESS OFFER



■ మహిళలకు, నిరుద్యోగులకు ఇంటి వద్దనే ఉంటూ 9,999/- పెట్టుబడితో ఎక్స్‌పోర్ట్ క్యాండిల్స్ తయారు చేసి మంచి ఆదాయం పొందే అవకాశం. బైబ్యాక్ తీసుకోబడును. KKD, RJY. ✆ : 91334 45887 [R-1154994]

Real Estate

PLOT FOR SALE

■ కాకినాడ పల్లంరాజు నగర్‌లో 50 x 90 ఒక సైటు, పిఠాపురం టోల్ ప్లాజా దగ్గర 2500 గజాలు, వెంకట నగర్‌లో 500 గజాలు అమ్మకానికి కలవు. ఫోన్ : 95500 58067 [V- 2675]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2557]

FLAT FOR SALE

■ AMP Deluxe Flats 2 BHK 1100 Sft. Prime Location Main Road ready to occupy. 100% Vasthu, Sbi Project Loan available ✆ : 80196 00487 [R-1229078]

Wanted

■ కాకినాడ Foton Decors కంపెనీ నందు పనిచేయుటకు Office Boys మరియు Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి✆ : 88826 56789 [R-1229050]

HOUSE FOR SALE

■ 214 Sft. ఇండివిడ్యువల్ హౌస్ అమ్మకమునకు కలదు. ముత్యాలమ్మగుడి దగ్గర మండవారి వీధి, ధవళేశ్వరం, రాజమండ్రి. ✆ : 90142 37891 [V- 823855]

■ ఇంటి పని, బేబీకేర్, పేషెంట్‌కేర్ (M/F), వంట మనిషి. జీతం : 15K-20K, 24 గం॥, భో॥ వసతి, లోన్, బోనస్ ఫ్రీ. 9160002193 [SCA-24000202]

SITE FOR SALE

■ కొవ్వూరులో ఏలూరు హైవేకి ఆనుకుని ఉన్న నార్త్ ఫేసింగ్ గల 200 చ॥ గ॥ స్థలం అమ్మకమునకు కలదు. ✆ : 9000 52 0036 [R-1154995]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పనికి వర్కర్స్/నర్సులుకావలెను.ఫ్రీ వసతి+భోజనం .జీతం 20K.ఫోన్. 8977639662, 8977639663 [HA-1379]

■ Wanted Male and Female work for MNC Company Qul: 10th to degree Sal: 15k to 25k Cont: 9030612463 (work from home facility is available) [G-9020]

■ కష్టమైన్స్ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం, HYD. ఫోన్: 6309020999 [HA-98313]

■ ఆఫీస్ ఇన్‌ఛార్జ్, మెకానిక్స్ కావలెను. అర్హత : ITI, Diploma, B.Tech., ఫ్రెషర్స్ కూడా ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ఇవ్వబడును. జీతం : 12,000 నుండి 25,000 వరకు. వ : 20-35 సం॥లు మధ్య. సంప్ర॥ శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. ✆ : 81434 12349 [R-63]

■ కావలెను : రెసిడెన్షియల్‌గా పని చేయుటకు నిడదవోలు / శంకరాపురం గ్రామం హృదయాలయం దివ్యాంగుల ఆశ్రమంలో రెసిడెన్షియల్ ఉద్యోగులు అనుభవం కలిగిన Administrator (B.Ed/Spl.B.Ed) Lady Warden....2 No.s, ఇంటర్ పాస్/ డిగ్రీ, వంటవారు (స్త్రీ)....3, ఆయామ్మలు....2, మేల్ వార్డెన్ ... 2 డిగ్రీ లేదా ఇంటర్, స్వీపర్ ...1, డ్రైవర్ ....1, సెల్ : 94409 42148, 62817 04979 [P- 1038]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆ హోదా ఒక్కరోజే..

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా సోమశేఖరరావు



కాకినాడ రూరల్: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పిట్టా సోమశేఖరరావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం పలువురు పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పించింది. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీగా రాజమహేంద్రవరంలో పనిచేస్తున్న సోమశేఖరరావుకు ఎస్పీ(నాన్ కమాండింగ్) పదోన్నతి కల్పించి ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చింది. సీనియర్ పోలీస్ అధికారిగా వివిధ హోదాల్లో పని చేస్తూ ఎస్పీ స్థాయికి ఎదిగిన సోమశేఖరరావు ఆ పదవిని ఒక్కరోజు మాత్రమే స్వీకరించనున్నారు. శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టి సాయంత్రం ఆయన ఉద్యోగ విరమణ పొందనున్నారు. దీంతో ఒక్కరోజు పాటు ఆయన ఏపీఎస్పీ కమాండెంట్‌గా వ్యవహరించనున్నారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: స్థానిక పోలీస్ కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీలకు సంబంధించి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో వికలాంగులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సీనియారిటీ అనుసరించి ఉద్యోగులు తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశామన్నారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని వివరించారు. నిర్వహణ తీరుపై సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. ఈ కౌన్సెలింగ్‌ను అదనపు ఎస్పీలు భాస్కరరావు, శ్రీలక్ష్మి పర్యవేక్షించారు.

విద్యుత్ షాక్‌తో గేదె దూడ మృతి



మృతి చెందిన గేదె దూడ

అల్లవరం: గోడిలో కరెంట్ స్తంభం నుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి గేదె దూడ మృతి చెందింది. కరెంట్ స్తంభం నుంచి వేలాడుతున్న వైరుకు కొబ్బరిచెట్టు ఆకు తగిలి ఉన్నాయి. ఇది పక్కనే గేదె దూడకు తగిలింది. దీంతో గేదె దూడ విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. గోడిలో శుక్రవారం జరిగిన ఈ ఘటన విద్యుత్ అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. సమయానికి విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో గేదె దూడ మృతి చెందిన పాడి రైతు శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా మారుతున్నాయని లైన్‌మెన్‌లకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ప్రజలు, జీవుల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నా వీరికి పట్టడం లేదని వారు ఆరోపించారు.

చేపల రైతుల నిరసన

అమలాపురం టౌన్: అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో కొన్ని గ్రామాలకు చెందిన చేపల రైతులు స్వామి నాయుడు అనే వ్యక్తి ద్వారా ఒడిశాకు చెందిన చేపల వ్యాపారి సంజయ్ కలాసీకి విక్రయాలు జరిపి మోసపోయారని ఆరోపిస్తూ స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో శుక్రవారం రాత్రి నిరసన వ్యక్తం చేశారు. ఈ మోసంలో స్వామినాయుడికి సంబంధం లేదని, కలాసీని నమ్మి చేపలు విక్రయించామని వారన్నారు. తక్షణమే సంజాయ్ కలాసీని అరెస్ట్ చేసి రైతులకు రూ.4 కోట్ల బకాయి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో చేపల రైతులు నరసింహరావు, జోగయ్యనాయుడు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రైతుల నిరసన గడియారం స్తంభం సెంటర్‌లో పట్టణ పోలీసు స్టేషన్ వద్దే జరగడంతో ఈ విషయమై సీఐ క్రిష్టోఫర్‌ను సంప్రదించగా, ఈ కేసు పూర్తిగా రాజమహేంద్రవరానికి సంబంధించినదని చెప్పారు. చేపల రైతులు తనకేమీ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం

ఆలస్యంగా నడచిన రైళ్లు

అన్నవరం: భువనేశ్వర్‌- కాచిగూడ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా ఆ ఇంజిన్ స్థానంలో జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌ను తగిలించి పంపించిన ఘటన శుక్రవారం రాత్రి అన్నవరం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. దీనివల్ల విశాఖ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా అన్నవరం నుంచి బయలు దేరాయి. ఆ వివరాల ప్రకారం.. విశాఖ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు అన్నవరం చేరుకుంది. ఆ రైలులో ఏసీలు పనిచేయడం లేదని, లైట్లు వెలగడం లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేసిన అధికారులు రైలు ఇంజిన్‌లో లోపం ఉన్నట్లు గుర్తించారు. అదే సమయంలో లింగంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ అన్నవరం రావడంతో రైల్వే ఉన్నతాధికారుల అనుమతితో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌ను విశాఖ ఎక్స్‌ప్రెస్ బోగీలకు కలిపి పంపించారు. ఈ కారణంగా విశాఖ ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయల్దేరింది. కాగా, తరువాత విశాఖ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌కు మరమ్మతులు చేసి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు తగిలించి మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 9.35 గంటలకు అన్నవరం నుంచి విశాఖపట్నం పంపించారు. రెండు రైళ్లు అన్నవరం రైల్వే స్టేషన్‌లో నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఈ వివరాలు తెలుసుకునేందుకు ‘సాక్షి’ స్థానిక రైల్వే స్టేషన్ ఎస్ఎస్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. ఈ ఘటనను రైల్వే పోలీసులు మాత్రం ధ్రువీకరించారు.